క్లుప్తంగా

గోవాడ ఫ్యాక్టరీకి చెరకు తరలింపు



కొరుప్రోలు కాటావద్ద చెరకు లోడ్ చేస్తున్న రైతులు

ఎస్.రాయవరం : ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో నాట్లు వేసిన చెరకు గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నట్టు ఎండీ వెంకటేశ్వరరావు తెలిపారు. చెరకు సరఫరా పర్యవేక్షణ లోడింగ్, అన్‌లోడింగ్ ఆ ఫ్యాక్టరీ యాజమాన్య పరిధిలో నడుస్తోందన్నారు. చెరకు విస్తీర్ణం కేవలం 8 వేల నుంచి 9 వేల టన్నుల వరకు మాత్రమే ఉంటుందని చెప్పారు. కొరుప్రోలు వద్ద ప్రయివేటు కాటా వద్ద లోడింగ్ చేసుకునే నేరుగా గోవాడ ఫ్యాక్టరీకి తరలిస్తున్నట్టు చెప్పారు.

ఆధార్ సెంటర్ తనిఖీ

కోటవురట్ల : విద్యార్థులు ఆధార్‌లో చేర్పులు, మార్పులు ఉంటే నమోదు చేయించుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఆమె బుధవారం సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్‌లో వివరాలు తప్పులు లేకుండా ఉండాలని విద్యార్థుల ధృవపత్రాలు, ఆధార్ కార్డులో వివరాలు ఒకేలా ఉండేలా సరిదిద్దుకోవాలన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల ఏర్పాటు



కొత్తపేటలో నిర్మించిన ఇంకుడు గుంత

రాంబిల్లి : ఏషియన్ పెయింట్స్ కంపెనీ ఆర్థికసాయంతో పలు గ్రామాల్లో ఇంకుగు గుంతలు నిర్మించారు. రాంబిల్లి, రాంబిల్లి శివారు వాడపాలెం, కుండలదేవునిపాలెం, యాతపేట, కొత్తపేట గ్రామాల్లో 80 ఇంకుడు గుంతలు నిర్మించినట్లు ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు తెలిపారు. అలాగే ఏషియన్ పెయింట్స్ ఆర్థిక సాయంతో మండలంలో 10 గ్రామాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేస్తున్నామని ఆయన తెలిపారు. మండల అభివృద్ధికి ఆ సంస్థ సహకారం అందించడం అభినందనీయమన్నారు.

డ్రైనేజీల నిర్మాణం ప్రారంభం



కె.వెంకటాపురంలో నిర్మిస్తున్న డ్రైనేజీ

కోటవురట్ల : కె.వెంకటాపురంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. పలు వీధుల్లో డ్రైనేజీ సమస్య ఉండడంతో పరిష్కారానికి సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ చర్యలు తీసుకున్నారు. బుధవారం 8వ వార్డులో డ్రైనేజీ నిర్మాణం ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ దశల వారీగా గ్రామంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తోందన్నారు.

ఏప్రిల్ 2న వరాహ లక్ష్మీనృసింహ స్వామి కల్యాణోత్సవం

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధిలో వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఏప్రిల్ 2వ తేదీన స్వామి వారి తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కల్యాణం చేయించేందుకు ఆసక్తి గల దంపతులు 81213 16268 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి కరాటే చాంపియన్ షిప్ పోటీలు

అనకాపల్లిటౌన్: విశాఖ స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ సీఎం కప్-2023 పోటీల ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ బుధవారం పరిశీలించారు. ఈ పోటీలు విశాఖలో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. వివిధ దేశాల నుంచి అంతర్జాతీయ క్రీడాకారులు హాజరవుతారని ఆయన చెప్పారు.

హామీలన్నీ నెరవేరుస్తున్న సీఎం జగన్



4వవార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు చేపడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందజేస్తున్నారని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. బుధవారం ఉదయం యలమంచిలి మున్సిపాలిటీ 4వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మతో కలిసి నిర్వహించారు. మూడున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం ఆయా కుటుంబాలకు చేకూర్చిన లబ్ధిని ప్రజలకు వివరిస్తూ అందుకు సంబంధించిన బుక్‌లెట్లను ఆయన పంపిణీ చేశారు. పథకాలు పంపిణీలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కరించే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని, ప్రతి రోజు ఉదయాన్నే ప్రజలతో మమేకం అవడం ద్వారా ప్రజలు నాడి తెలుస్తుందని పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమాన్ని , అభివృద్ధిని ఆకాంక్షించే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉండడం వల్ల ప్రజలకు అన్ని విధాలుగా మేలు జరుగుతోందని ప్రజల ప్రతి కష్టానికి ఒక్కో పథకాన్ని అమలు చేస్తూ పేదరిక నిర్మూలన దిశగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వలంటీర్లకు ఎమ్మెల్యే కన్నబాబురాజు సొంత నిధులతో వాటర్ ప్రూఫ్ బ్యాగ్‌లు అందజేశారు. వలంటీర్లు అంతా అంకితభావంతో దృఢ సంకల్పంతో పని చేస్తే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో త్వరలోనే మంచి కబురు వింటారని ప్రభుత్వానికి ఎంతో క్రియాశీలకమైన గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది పనితీరుతో ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందని ఎమ్మెల్యే అన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ జెడ్పీటీసీ ఆడారి శ్రీధర్ (చిన్నా) మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, మున్సిపల్ కౌన్సిలర్‌లు కర్రి శివ, డాక్టర్ త్రినాథ్, గొర్లె వెంకట్, పిట్టా సత్తిబాబు, దూది నరసింహమూర్తి పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

యలమంచిలి మున్సిపాలిటీ ఎస్.కాలనీ సచివాయం పరిధి కాకివాని వీధి,సైతారుపేట జంక్షన్ వద్ద నుండి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కన్నబాబురాజు మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ అధికారులు ఒక ప్రకటనలో బుధవారం సాయంత్రం పేర్కొన్నారు.

రూ.3,300 కోట్ల రుణాలు లక్ష్యం

కోటవురట్ల: ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు రూ.3,300 కోట్ల రుణాలు లక్ష్యంగా పనిచేసినట్టు లీడ్ బ్యాంకు మేనేజరు ఆర్.సత్యనారాయణ తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో నాతవరం, కోటవురట్ల, మాకవరపాలెం మండలాల బ్యాంకు మేనేజర్లతో బుధవారం సమీక్ష చేశారు. రుణాల మంజూరు, రికవరీలు, మొండి బకాయిలు, సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాతవరం, కోటవురట్ల, మాకవరపాలెం మండలాల పరిధిలోని బ్యాంకుల ద్వారా ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు రుణాలు మంజూరు చేసినట్టు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో 87 శాతం, రబీ సీజన్‌లో ఇప్పటికి 52 శాతం రుణాలు ఇచ్చినట్టు తెలిపారు. రబీ సీజనుకు సంబంధించి ఇంకా రెండు వారాల సమయం ఉన్నందున లక్ష్యం పూర్తి అవుతుందని తెలిపారు.

గృహ నిర్మాణాలపై వీడియో కాన్ఫరెన్సు



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న ఎంపీడీవో చంద్రశేఖర్, అధికారులు

కోటవురట్ల: వైఎస్సార్ జగనన్న కాలనీలలోని ఇళ్ల నిర్మాణాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఎంపీడీవో చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఇళ్ల నిర్మాణాల మార్గదర్శకాలు, బిల్లుల విడుదల, అందుబాటులో ఉన్న మెటీరియల్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఉన్నతాధికారులు సమీక్ష చేశారు. ఇందులో హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడిని ఆదుకోవాలి



అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన నాటు కోళ్ల పెంపకం పూరిపాక

ఎస్.రాయవరం : నాటుకోళ్లతో పూరిపాక కాలిబూడిదైన ఘటనలో బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ కర్ర సత్యనారాయణ కోరారు. తిమ్మాపురం శివారు కోనవానిపాలెం గ్రామంలో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైన పూరిపాకను సందర్శించి, బాధితుడు మామిడి తాతాబ్బాయిని పరామర్శించారు. పూరిపాకలో 100కుపైగా నాటు కోళ్లను పెంచుకుంటున్నాడని రాత్రి సమయంలో అగ్నిప్రమాదానికి గురయ్యి పూర్తిగా కాలి బూడిదయ్యిందని అన్నారు. ప్రమాద నష్టాన్ని వీఆర్వో నూకరాజుకి వివరించారు. సుమారు లక్ష రూపాయలు వరకు నష్టం జరిగిందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బొజ్జన్న, వియ్యపు సింహాద్రి, దుర్గబాబు తదితరులు బాధితుడిని పరామర్శించారు.

నేవీ నిర్వాసితుల ధర్నా

రాంబిల్లి : నేవీ నిర్వాసితులు, నేవీ ప్రభావిత గ్రామాల ప్రజలు ధర్నా కొనసాగిస్తున్నారు. నేవీ మెయిన్‌గేటు వద్ద నిర్వహిస్తున్న ధర్నా బుధవారం నాటికి 101 రోజులకు చేరుకుంది. పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సీఎం వై.ఎస్.జగన్ దృష్టికి మరోసారి నేవీ నిర్వాసితుల అంశాన్ని తీసుకువెళతానని పేర్కొన్నట్టు ఐక్యవేదిక నాయకులు తెలిపారు.

ఆన్‌లైన్ యాప్స్‌తో తస్మాత్ జాగ్రత్త



మాట్లాడుతున్న ఎస్ఐ అలీ

మునగపాక : బ్యాంక్ లావాదేవీలకు సంబంధించిన సమాచారాన్ని ఇతరులకు ఇవ్వకుండా జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ మహమ్మద్ ఆలీ కోరారు. రోజురోజుకూ సైబర్ క్రైమ్ నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. అమాయకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలోని వాడ్రాపల్లిలో బుధవారం ఆన్‌లైన్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది ఫేక్ కాల్స్ చేస్తూ మీకు బహుమతులు వచ్చాయంటూ మీ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నంబరు చెప్పాలంటూ మోసాలకు పాల్పడుతుంటారన్నారు. అలాగే ఆన్‌లైన్ యాప్స్ విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, మహిళా పోలీసు, గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు దిశా నిర్దేశం



మా నమ్మకం నువ్వే జగన్ సామాగ్రిని అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరించాలని మండల సచివాలయాల కన్వీనర్ రాజాన విజయ్ అన్నారు. అచ్యుతాపురం మండలంలోని ఉప్పవరంలో బుధవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యాలయంలో భాగంగా ఆయన స్థానిక గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లతో మాట్లాడుతూ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, మండల పార్టీ నాయకులు కోన బుజ్జి, పార్టీ అధికార ప్రతినిధి పిన్నంరాజు వాసు, ఎంపీటీసీ లాలం శ్రీను, రావి శోభన్‌బాబు, మాజీ జెడ్పీటీసీ భీముని వెంకటేశ్వరరావు, సర్పంచ్ రాము, చిన్ని శ్రీను పాల్గొన్నారు.

11న గౌరీపరమేశ్వరుల ఉత్సవం



ఉత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గుడివాడ హిమగౌరి

కశింకోట: కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద కొలువుదీరిన గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని ఈ నెల 11న భారీఎత్తున నిర్వహించనున్నారు. ఉత్సవ కరపత్రాన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ భార్య హిమగౌరి మిందిలోని వారి స్వగృహంలో బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేగి గోపీకృష్ణ, పెంటకోట రాము, వేగి రామకోటేశ్వరరావు, వేగి దొరబాబు, ఆడారి నరసింగరావు, దాడి నాగరాజు, నాగు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గౌరీపరమేశ్వరుల మహోత్సవ కరపత్రాన్ని వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకుడు దాడి రత్నాకర్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమభాస్కర్, 81వ కార్పొరేటర్ లక్ష్మీ సౌజన్య, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై వేధింపులు తగవు

ఫ్యాప్టో జిల్లా నేతలు



సంఘీభావం ప్రకటిస్తున్న ఫ్యాప్టో జిల్లా నేతలు

అనకాపల్లి రూరల్: ఉపాధ్యాయులపై ఇటీవల గతంలో ఎన్నడూ లేని విధంగా ఉన్నతాధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని ఫ్యాప్టో జిల్లా నేతలు అభిప్రాయపడ్డారు. బుధవారం అనకాపల్లి సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సమావేశంలో ఉపాధ్యాయులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న అనేక ఇబ్బందుల గురించి చర్చించారు. ఫ్యాప్టో చైర్మన్ చిన్నబ్బాయి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ ఉన్నతాధికారుల వేధింపులతో ఉపాధ్యాయులంతా తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, వెంటనే అలాంటి చర్యలను విడనాడాలని ఉన్నతాధికారులను కోరారు. విద్యా సంవత్సరం ఆఖర్లో ఉపాధ్యాయులంతా స్వేచ్ఛగా విద్యాబోధన చేసేలా అధికారులు అవకాశం కల్పించాలని కోరారు. ఇటీవల విధి నిర్వహణలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వారంతా సమావేశంలో ప్రస్తావించారు. సమస్యల పరిష్కారం కోసం అన్ని సంఘాలతో కలిసి పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. ఫ్యాప్టో జనరల్ సెక్రటరీ వై. సుధాకర్, కోచైర్మన్ సాయి ప్రసాద్, డిప్యూటీ సెక్రటరీలు ప్రేమ్‌కుమార్, ఎన్. సన్యాసినాయుడు, కె. రమణాజీ, కార్యవర్గ సభ్యులు వి. శ్రీలక్ష్మి, శాస్త్రి, ఎ. రవి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు సత్వరం ప్రారంభించాలి



లబ్ధిదారులతో సమావేశమైన ఎంపీడీవో

నక్కపల్లి : గొడిచర్లలో ప్రభుత్వం కేటాయించిన జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను త్వరగా ప్రారంభించాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. బుధవారం ఆయన గృహ నిర్మాణశాఖ అధికారులు, సచివాలయ సిబ్బందితో కలసి జగనన్న లేఅవుట్‌లో సమావేశం నిర్వహించారు. ప్లాట్లు పొందిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. రోడ్డు, ఇతర సమస్యలు ఉంటే పరిష్కరిస్తామన్నారు. ప్లాట్లలో నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ఇళ్ల స్థలాల కోసం చాలా మంది దరఖాస్తు చేసుకున్నారని, ప్లాట్లు పొందిన లబ్ధిదారులు నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని అన్నారు. కాని పక్షంలో అర్హులైన వారికి కేటాయించడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులకు అవసరమైన ఇసుక, సిమెంట్, ఐరన్ బిల్లులను ప్రభుత్వం సమకూరుస్తోందన్నారు. వాడుకనీరు, విద్యుత్ సదుపాయం, రహదారి సదుపాయాలను కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లు పార్వతి రమణ, ఎంపీటీసీ నిట్ల గోవిందు, కార్యదర్శి సాయిలక్ష్మి, వీఆర్వో సన్యాసిరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లల రామకృష్ణ, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి సహకరించాలి



పాయకరావుపేట మెయిన్‌రోడ్డును పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం

పాయకరావుపేట : పట్టణంలో గల మెయిన్‌రోడ్డు నిర్మాణానికి అందరూ సహకరించాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం కోరారు. మెయిన్‌రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టడం కోసం ఆయన బుధవారం సంబంధిత అధికారులతో పీఆర్ అతిథి గృహంలో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరైందన్నారు. చిన్నవర్తకులు సమస్యల కారణంగా రోడ్డు నిర్మాణం ఆలస్యమవుతున్నదన్నారు. రోడ్డు నిర్మాణం జరిగితే పట్టణం కూడా అభివృద్ధి చెందుతుందని, మౌలిక వసతులు కల్పన కూడా జరుగుతుందని తెలిపారు. రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుంటున్న చిన్న వర్తకులకు ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణం చేయడానికి సహకరించాలన్నారు. రోడ్డు నిర్మాణం జరిగిన తర్వాత యథా ప్రకారం వారి వ్యాపారాలు సాగించుకోవచ్చునన్నారు. ఎంతో కాలంగా నిర్మాణం చేయకపోవడం వల్ల వాహన చోదకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు నిర్మాణానికి తీసుకోవలసిన రోడ్డు కొలతలను మరలా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు పక్కన వున్న వ్యాపారుల జాబితాను కూడా తయారు చేయాలని ఆదేశించారు. మండల తహసీల్దార్ కె.జయప్రకాష్, ఆర్అండ్‌బీ అధికారులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

కుంచవానిపాలెంలో గౌరీష్ సంస్మరణ సభ

మునగపాక : దేశ విదేశాల్లో పర్యటించి 13 భాషలలో మాట్లాడే చినతాతబ్బాయి(గౌరీష్) మహా మేధావి అని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. కుంచవానిపాలెం గ్రామంలో బుధవారం ఇందల గౌరీష్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ విదేశాల్లో పర్యటించి అందరితో అపర మేధావిగా గౌరీష్ గుర్తింపబడ్డారన్నారు. అదే కుటుంబానికి చెందిన ఇందల హేమలత మల్లవరం పంచాయతీకి నూతన సర్పంచ్‌గా ఈ ప్రాంత ప్రజలు ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ నేత ఇందల నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మాజీ ఎంపీపీ దాసరి అప్పారావు,వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు,వైఎస్సార్‌సీపీ నేతలు గణేష్, రమణ పాల్గొన్నారు.

బాషాకు ఘన సత్కారం



బాషాను సత్కరిస్తున్న గ్రామస్తులు

మునగపాక : గవర్ల అనకాపల్లి నెహ్రూయూత్ క్లబ్ ఏర్పాటుకు మూల కారకులైన ఎస్‌ఏ బాషాను బుధవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. యూత్ కో-ఆర్డినేటర్‌గా భాషా పలు సేవలందిస్తూ గవర్ల అనకాపల్లిలో నెహ్రూ యూత్ క్లబ్ ఏర్పాటుకు తోడ్పాటునివ్వడంలో భాగంగా సత్కార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ దొడ్డి మంగవేణి, మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత షేక్ ఇస్మాయిల్‌లు మాట్లాడుతూ గ్రామాల్లో యువజన సంఘాలు ఏర్పాటు చేయడంతో పాటు ఎంతో మంది యువతను భావితరాలకు అందించిన ఘనత బాషాకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు కొయిలాడ వీరునాయుడు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, సిరసపల్లి ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, వీరమహాలక్ష్మినాయుడు, పి.కుమార్, దాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డులో ప్రమాద ఘంటికలు

- ఇరుకురోడ్డుతో వాహనదారుల ఇక్కట్లు
- విస్తరణ కోసం ఎదురుచూపులు



కూలిపోతున్న ఘాట్‌రోడ్డు

కోటవురట్ల : ఆ ఘాట్‌రోడ్డు అసలే ఇరుకుమయం ..ఆ రోడ్డులో ఎదుట వచ్చే వాహనాలను తప్పించాలంటే డ్రైవింగ్‌లో ప్రావీణ్యం ఉండాల్సిందే. కొత్తగా వాహనాలు నడిపేవారైతే ఏమాత్రం కంగారు పడినా 25 అడుగుల లోతులో ఉన్న వరాహనదిలో పడి మృత్యువాత పడాల్సిందే. ఎప్పుడో ఎనభై ఏళ్ల క్రితం బ్రిటిష్ పాలకులు నిర్మించిన ఘాట్ రోడ్డు అది. నేటికీ అదే రోడ్డు ఏమాత్రం అభివృద్ధికి నోచుకోకుండా వాహనదారులకు దిక్కయింది. ఆ ఘాట్ రోడ్డు ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డు. ఓ పక్క ఎత్తైన కొండ. మరో పక్క వరాహనది, మధ్యలో ఘాట్‌రోడ్డు ఓ వింతైన అనుభూతిని ఇస్తుంది. బ్రిటిష్ పాలకులు అప్పటి పరిస్థితులకు అనుగుణంగా నిర్మించగా నేడు విపరీతంగా వాహనాలు పెరిగాయి. ఇరుకు రోడ్డు కావడంతో వాహనాలు తప్పించే వీలు లేక తరచూ ట్రాఫిక్ జామ్ అవుతూ గంటల కొద్దీ ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా నదిలోకి జారిపోయే ప్రమాదం ఉంది. ఈ ఘాట్‌రోడ్డు విస్తరణ తప్పనిసరి అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అలానే ఉండిపోయింది.

మూడు మండలాలకు వారధి..

ఈ ఘాట్‌రోడ్డు ఇటు నర్సీపట్నం, అటు ఎస్.రాయవరం మండలాలను కలుపుతూ మధ్యలో కోటవురట్ల మండల పరిధిలో ఉంది. నిత్యం వందలాది మంది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ద్విచక్ర వాహనాలతో పాటు భారీ వాహనాలు తిరుగుతుంటాయి. సరుగుడు లోడు, క్వారీ లారీలు, చెరకు లోడుతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇరుకుమయంగా ఉండడంతో వాహనాలను తప్పించలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మరో పక్క ఘాట్‌రోడ్డుపై ఉన్న రక్షణ గోడ దాదాపు 80 శాతం కూలిపోయింది. భారీ వరదలకు కొంత మేర ఘాట్‌రోడ్డు కూడా నదిలోకి జారిపోయింది. కూలిపోయిన చోట తాత్కాలికంగా చిన్న గోడ నిర్మించగా అది కూడా కూలిపోతూ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది.

ఘాట్‌రోడ్డును విస్తరించాలి..

బ్రిటిష్ పాలకులు నిర్మించిన ఘాట్‌రోడ్డు నేటికీ అభివృద్ధి చెందకపోవడం దారుణం. ఇరుకుగా ఉండడంతో తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. అధికారులు, పాలకులు స్పందించి ఘాట్‌రోడ్డును విస్తరించేందుకు కృషి చేయాలి.

– పులి చంటి, రామచంద్రపురం

పరిశీలించి ప్రతిపాదన పెడతాం..

ఘాట్‌రోడ్డును పూర్తిగా పరిశీలించి అవసరమనుకుంటే విస్తరణకు ప్రతిపాదన పెడతాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత వరకు మంజూరుకు కృషి చేస్తాం.

– ప్రభు, డీఈ, ఆర్అండ్‌బీ

ఫుడ్ కమిటీ ఏర్పాటుకు వినతి

అనకాపల్లిటౌన్: ఆహార సలహా సంఘాలు (ఫుడ్ కమిటీ) ఏర్పాటు చేయాలని నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూదికొండ మాణిక్యాలరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరకులు అందేవని, ప్రస్తుతం రెండు, మూడు సరకులతో సరిపెడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే ఫుడ్ కమిటీలు ఏర్పాటు చేసి పేదల సమస్యలు తెలుసుకోవాలని ఆయన కోరారు.

ప్రకృతి ఉత్పత్తులతో మెరుగైన ఆరోగ్యం



సుందరయ్యపేటలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అనకాపల్లి రూరల్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ విభాగం అనకాపల్లి డివిజన్ మాస్టర్ ట్రైనర్ వర్మ అభిప్రాయపడ్డారు. మండలంలోని సుందరయ్యపేట గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులు, స్థానిక మహిళలకు అవగాహన కల్పించారు. నవధాన్యాల సాగు, 30 రకాల విత్తనాలతో పండించే వివిధ రకాల ఆహార ఉత్పత్తుల గురించి వివరించారు. పురుగు మందుల వినియోగం లేని పంటల సాగు, కిచెన్ గార్డెన్ పెంపకంతో కలిగే ప్రయోజనాలు వివరించారు.

సచివాలయాల్లో ఉచిత ధ్యాన శిక్షణ

కశింకోట: మండలంలో సచివాలయాల వారీగా ఈ నెల 13 నుంచి ధ్యానంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. సంపతిపురం వద్ద ఉన్న రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో ప్రజలకు నిర్దేశించిన రోజు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు.

12న మొక్కలు నాటే కార్యక్రమం

అనకాపల్లిటౌన్: అనకాపల్లి గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 12న కశింకోట మండలం సాయినగర్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో ప్రతీ నెలా జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భావితరాలను దృష్టిలో పెట్టుకుని మొక్కలను నాటి, పరిశుభ్రమైన వాతావరణంలో జీవించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు.